


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -171-

(17 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**చేనేత వారోత్సవాలు** జయప్రదంగా జరిగాయి. రకరకాల వస్త్రాలు ప్రదర్శించబడ్డాయి. ప్రజలు సంతోషంతో కొనుక్కోగలిగారు కంటికి నచ్చిన వాటిని.

ఆ వారం రోజులూ అక్కడ తిరుగుతూ వస్త్రాలను గురించి చెప్పుకున్నమాటలు, చేసిన ప్రసంగాలూ ఎంతో సాంప్రదాయ సిద్ధంగా వున్నాయి.

"ఊళ్ళో ఎక్కడ చూచినా ఉలిపిరి కట్టలే. చక్కగా వచ్చి ఇక్కడ కొనుక్కోకూడదూ. ఎంత చక్కగా ఉన్నాయో, మనవాళ్ళు నేసిన వస్త్రాలు.. మన్నికైన వస్త్రాలు నిఖార్సు రంగులు.. శిఖావేనట్లు కొలతలు.. పిచ్చిగా పెడతారు ఇతర చీరలకు సొమ్ము."

"చూడు! చూడు ఆ నీలం చీర చూడు. అది కట్టుకుంటే పావురా పిట్టలాగా వుంటారు. ఆ పచ్చచీర చూడు ధరిస్తే రామచిలకల్లాగా ఉంటారు. "

"ఏమిటో ఇప్పుడందరికీ అంచులు లేని చీరలే. అలాటివి కట్టుకోవడం అఘాయిత్యంగా భావించే వారు ఇదివరకటి రోజుల్లో. అంచులేనిదే అందం ఏం వుంది? చీరలకు అంచు లేకపోతే ఎలా? స్త్రీకి శీలం లేకపోతే ఎలా?" ఎలా ఏమిటి లెండి వెలవెల పోవడమే.

ప్రతి చీరకూ జరీ అంచు కుదరకపోవచ్చు. ఏదో పట్టంచో, నూలు అంచో వుండాలా? అవి కూడా తీసేస్తే ఎలా?

అంచును బట్టీ అందం మారుతుందనే శాస్త్రం వూరికే వచ్చిందా? అంచు కోసం పెట్టవచ్చు ఎంత ఖరీదైనా అనుకునేవారు ఇదివరలో. ఇప్పుడు ఆ ఆలోచనే లేదెవరికీ.

చూడండి నూలు చీరలు ఎంత చక్కగా వున్నాయో. రకరకాల అంచులు, రంగు రంగుల అంచులూ కట్టుకున్న వాళ్ళ హోదాలు పెంచుతాయి. ఆ అంచులు అని ఒకామె అంగడి ముందు నిలబడి, అతిగా మెచ్చుకుంటూ మాట్లాడి చాలాసేపు.

నూలు చీర కట్టుకుని, పచ్చిపులుసు ముద్ద నోట్లో పెట్టుకో గలిగితే చాలు. జీవితం అలాగ్గా వెళ్ళిపోతుంది అని మనవాళ్ళు మాట్లాడుకుంటూ వుంటారు. అంతేగాని, పట్టు చీరలు ధరించి అన్నంలో పసిడి రేకులు వేసుకు తినాలనే దురాశకు పోయే, వాళ్ళు చాలా తక్కువ మంది వుంటారు.

కాలం కఠినంగా వున్నా స్త్రీలకు చీరలమీద మోజు తగ్గడం లేదు అనడానికి నిదర్శనాలు లేవు. చాలామంది ఖరీదు చీర ధరించి, కాపురాల సంగతి ఎలా వున్నా గర్వంగా సంచరించడం జరుగుతోంది. కాని చేనేత సప్తాహంలో బేరాలకు వచ్చిన వారిలో చాలామంది మధ్య తరగతి వారే.

వారు నూలు చీరల మీద అభిమానంతో వాటిని కొనుక్కుపోవడంతో కొంత జాతీయత గోచరించింది. వారు కొని తీసుకు వెళ్ళే చీరల పొట్లాల్లో మంచి వస్త్రకారులు పకపకలు వినిపిస్తాయి.

చీరలు వగైరాలు కొనడంలో నిజానికి కొన్ని గారహస్థ్య ధర్మాలు కూడా ద్యోతకమవుతూ వుంటాయి. భార్యా భర్తలు కలసి బేరానికి వస్తూవుంటారు సామాన్యంగా. అందులో కొందరు భర్తకు ఆధిపత్యం వదిలి, వారు చెప్పినట్లుగా చీరలు వగైరాలు సెలెక్ట్ చేసుకుంటారు. వారి సంభాషణలు ఎలా వుంటాయి.

"నే చెపుతున్నానా పచ్చ అంచు చీర తీసుకో ఒకటి. తర్వాత రెండోదానిమాట ఆలోచిద్దాం" అంటాడాయన.

"తీసుకుంటాననుకోండి. ఇంకా నాలుగైదు రకాలు చూడటం దేనికి నీ మాటేకాని" అని ఆయన పందిర బయటకు వెళ్ళి ఒక సిగరెట్టు ముట్టించుకొనడం జరుగుతుంది.

కొందరు పతిభక్తి ఎక్కువగాగల నారీమణులు "నా చీరల సంగతి తర్వాత చూద్దాం. మీరు ఆ సన్నంచు పంచలు ఒక జతా, ఆ ఉత్తరీయాలు రెండు. నాలుగు తువాళ్ళు, ఒక అరడజను జేబురుమాళ్ళు కొనుక్కోండి. ఇస్త్రీ చేయించి ఇంట్లో పడితే ఎంతో చక్కగా వుంటాయి. రెండు ఉతుకుల్లో తెల్లటి తెలుపొస్తాయి" అని భర్తలకు సలహాలు చెపుతూ ఉంటారు.

ఆయనగారు నవ్వి "చాలా! ఇంకేమైనా వున్నాయా?" ఈ దుకాణంలో సగం మాకు కావాలి. ఉంచండి లేదా పాక్ చేసి మా యింటికి పంపించండి అని చెప్పెయ్యి. తర్వాత తీరుబడిగా లెక్క చూసుకోవచ్చు" అంటాడు.

"అదేమిటండీ. మీరు బయట తిరిగేవారు. బట్టలు పెళపెళమంటూ, తళతళలాడుతూ వుండాలి. ఏ సమయంలో ఎక్కడికి వెళ్ళవల్సి వస్తుందో నలక్కుండా నాలుగు జతలు అట్టి పెట్టుకోవాలి." అంటుందామె ఆయనగారి దర్జాకు చెందిన దరహాసం చిందిస్తూ.

ఒక ఇల్లాలు, ఒక ఆడపిల్లను వెంట బెట్టుకుని చక్కావచ్చింది. ఆ అమ్మాయి ఇంగ్లీషు చదువుతోందిట. ఆ ఇద్దరు వస్త్రాలు ఎన్నిక చేస్తున్నారు కొనేస్తున్నారు. వాళ్ళను ఎరుగున్న ఒకామె వచ్చి "చీరలు కొంటున్నారా? మీవారు రారా?" అని ప్రశ్నించింది.

"ఇంకా నయం. ఆయన రావలసిందే. ఆయన్ని వెంటబెట్టుకుని, వెడితే గుళ్ళోకి వెళ్ళాలిగాని, ఊళ్ళోకి ఎక్కడికీ ప్రాప్తంలేదు. వెంట వస్తే రెండు జేబు రుమాళ్ళు కూడా కొననివ్వరు. వస్త్రాలు నచ్చవు. ధరలంతకంటే నచ్చవు. ఏ దుకాణానికి వెళ్ళినా తగాదే. ప్రతివాళ్ళతో మని మార్కెట్ ఎలా వుందో తెలుసా? అంటూ ఉపన్యాసం ప్రారంభిస్తారు. స్నేహితురాలి ఇంటికి వెళ్ళొస్తానని చెప్పి బయలుదేరా" అన్నదామె నవ్వుతూ.

"తర్వాత మాత్రం కోప్పడరూ" అంది స్నేహితురాలు.

"కోప్పడితే పర్వాలా. రెండు రోజులు మాట్లాడరు. ఈ కాపరం నేను చెయ్యలేనంటూ గంతులేస్తారు. తర్వాత మెల్లగా సమసిపోతుంది" అనందామె భరోసా పూర్వకంగా.

ఒకాయన భార్యకు రెండు మంచి చీరలు కొని ఇచ్చిన తర్వాత "పోనీ రెండు రెక్క దుప్పట్లు కొందామనుకున్నాను. కాని ఈసారి కుదరదు" అన్నాడు.

చీరలు కొన్న సంతోషంతో ఆమె చిరు నవ్వు నవ్వుతూ "మీ రెక్కలు చల్లగా వుంటే రెక్క దుప్పట్లకు కరువేమిటి? ఇంకోసారి కొనుక్కుందాం" అంటూ చకచకా ముందుకు నడిచింది.

మొన్న ఉగాదికి క్రొత్త చీర కట్టుకున్న వారిని చూడగానే అవతలవాళ్ళు వేసిన ప్రశ్న "రిబేట్ చీరా? ఎంత అయింది?" అని.

Post your comments